క్లుప్తంగా

వెండి పూలతో సహస్ర నామార్చన



మైలవరం: మకర సంక్రమణం ఉత్తరాయణం ప్రారంభం సందర్భంగా మంగళవారం భక్తులు సమర్పించిన వెండి పూలతో కోదండ రామ స్వామి వార్లకు సహస్ర నామార్చన నిర్వహించారు. దంపతులు, వివాహం జరగవలసిన ఆడ, మగ పిల్లలతో, పుట్టిన రోజు, వివాహం రోజు, తదితర పర్వదినాలలో భక్తులు స్వహస్తాలతో వెండి పూలతో పూజ చేసుకునే అవకాశాన్ని ఆలయ కమిటీ సభ్యులు కల్పించారు. దీని నిమిత్తం భక్తులు దేవాలయానికి రూ.316 చెల్లించి రశీదు తీసుకోవాలని కమిటీ సభ్యులు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నూజివీడు: ఆధ్యాత్మిక విశ్వగురువు, సైంటిఫిక్ సెయింట్ విశ్వస్ఫూర్తి గురుదేవులు మనకు అందించిన సిద్ధాంతాలను జన బహుళ్యంలోకి తీసుకువెళ్లాలని నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య అన్నారు. నవజీవన విధానానికి శ్రీ గురు విశ్వస్ఫూర్తి సిద్ధాంతాలే శరణ్యమని చెప్పారు. 2024 క్యాలెండర్‌ను నూజివీడు గురుపీఠంలో మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో స్ఫూర్తి కుటుంబం ఆంధ్రప్రదేశ్ ట్రస్ట్ సభ్యులు టీవీఎస్ ప్రసాద్, నూజివీడు గురు పీఠం సభ్యులు కేవీ రమేష్‌కృష్ణ, కుక్కడపు అనిల్, జిలాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం



నెమలి(గంపలగూడెం): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం సంక్రాంతి పండుగ రోజు గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తిరునగరి గోపాలాచార్యులు, అర్చక బృందంచే రంగనాయక స్వామి, గోదాదేవి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని కన్యాదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

అమ్మవారిని దర్శించుకున్న వాసుదేవరెడ్డి దంపతులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారిని సోమవారం రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, కల్పన దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆశీర్వచనం అనంతరం వారిని ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వేల్పుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాముని అక్షింతలతో శోభాయాత్ర



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): అయోధ్యలో రామమందిరం ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా శ్రీరాముడిని పూజించిన అక్షింతలతో మంగళవారం గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరామ భజన మండలి ఆధ్వర్యంలో జై శ్రీరామ్ నినాదాలతో, డీజే సౌండ్లతో గ్రామంలో శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు.

మాజీ సర్పంచ్ రాధాకృష్ణ మృతి



మైలవరం: వ్యాపారవేత్త, గ్రామ మాజీ సర్పంచ్ జూలూరు రాధాకృష్ణ (78) మంగళవారం మృతి చెందారు. రాధాకృష్ణ మైలవరం కోదండ రామాలయం దేవస్థానం మాజీ ప్రెసిడెంట్‌గాను వివిధ హోదాల్లో పనిచేసిన ఆర్యవైశ్య కురువృద్ధులు. ఆయన మృతికి పలువురు గ్రామ ప్రముఖులు, ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారులు సంతాపం తెలిపారు.

దాసాంజనేయుడికి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. కనుమ పండుగ స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు.

ఆనందోత్సాహాలతో వేడుకలు



నర్మదానగర్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



తిరువూరు సుందరయ్య కాలనీలో ముగ్గుల పోటీలు

- ఘనంగా సంక్రాంతి, కనుమ సంబరాలు
- బంధుమిత్రులు, కొత్త అల్లుళ్ల రాకతో సందడిగా పల్లెలు
- ఇళ్ల ముంగిట్లో ముత్యాల ముగ్గులు

నూజివీడు: నూజివీడు, తిరువూరు, మైలవరం, నియోజకవర్గాల్లో సంక్రాంతి, కనుమ పండుగలు వైభవంగా జరిగాయి. మకర సంక్రాంతి, కనుమ పండగలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. బంధుమిత్రులు, కొత్త అల్లుళ్ల రాకతో గ్రామాల్లో సందడి నెలకొంది. ఆటపాటలు, రంగవల్లులు, గొబ్బెమ్మలు, సంప్రదాయబద్ధంగా కోడిపందేలు, ఘుమఘుమలాడే వంటకాలతో పెద్ద పండగను ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు నూతన వస్త్రాలను ధరించి ఉత్సాహంగా గడపడంతో పాటు కొత్త బియ్యంతో పొంగలి చేసుకుని ఆరగించారు. ఇంటి ముందు రంగవల్లులు, ఆకాశంలో గాలిపటాలతో సంక్రాంతి పండుగ కనువిందు చేసింది. యువకులు, పెద్దలు సంప్రదాయంగా కోడిపందేలు వేయడానికి, చూడటానికి తరలివెళ్లగా మహిళలు, యువతులు, పిల్లలు ఇళ్ల వద్దనే ఉండి ఆనందంగా గడిపారు. కనుమ రోజైన మంగళవారం పశువులకు పూజలు చేశారు. మాంసాహారులు తమకిష్టమైన ఆహారంతో విందు భోజనాలు చేశారు.

పండుగల కోలాహలం..

గంపలగూడెం: సంక్రాంతి, కనుమ పండుగలను సోమ, మంగళవారాల్లో మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. పల్లెల్లో వాకిళ్లు రంగులతో నింపిన వివిధ రకాల రంగవల్లులతో చూడముచ్చటగా కనపించాయి. సంప్రదాయబద్ధంగా రథం, స్వర్గవాకిలి, కావేటి కాల్వలు, ఉయ్యాల చెరువు, తదితర ముగ్గులను రంగులతో అందంగా తీర్చిదిద్దారు. వినగడప, కొత్తపల్లి, తోటమూల తదితర గ్రామాల్లో యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు, బాలికలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. కనుమ పండుగ సందర్భంగా పశువులను శుభ్రం చేసి రంగులు చల్లారు, గోవులకు పూజలు చేశారు.

- మైలవరం: మైలవరం నియోజకవర్గంలో సంక్రాంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగువారి సంప్రదాయ పండుగల్లో సంక్రాంతి ఒకటి. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. భోగి రోజున ఉదయాన్నే భోగి మంటలతో పండుగ ప్రారంభమవుతుంది. సంక్రాంతి పండుగకు కొత్త అల్లుళ్లు అత్తమామల ఇళ్లకు చేరుకుంటారు. కొత్త అల్లుళ్లకు వారు సకల మర్యాదలు చేయడం ఆనవాయితీ. పండుగ శోభతో గ్రామాలు కళకళలాడాయి.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నంలో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. భోగి మంటలతో ప్రారంభమైన పండుగ సందడి సోమవారం ఇళ్ల ముందు ముగ్గులు వేసి రంగవల్లులు, గొబ్బెమ్మలతో తీర్చిదిద్దారు. పండుగ శోభతో గ్రామాలు కళకళలాడాయి. మంగళవారం కనుమ వేడుకలతో ముగించారు. గ్రామాల్లో గంగిరెద్దుల హడావుడి, హరిదాసులు సందడి నెలకొంది. పిండి వంటలు చేసుకుని నూతన వస్త్రాలు ధరించి పండుగను జరుపుకున్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను ఎంపీపీ పాలడుగు జ్యోత్స్నతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

తిరువూరులో..

తిరువూరు: మకర సంక్రాంతి వేడుకలు తిరువూరులో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఇళ్ల ముంగిట సంక్రాంతి రంగవల్లులు వేసి సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. తిరువూరులోని రాజ్యలక్ష్మీ సమేత రంగనాయకస్వామి ఆలయంలో కనుమ సందర్భంగా గోపూజ కార్యక్రమం, అయ్యప్పస్వామి ఆలయంలో కర్పూర జ్యోతి దర్శనం ఏర్పాటు చేశారు. మహిళా, యువజన సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య కాలనీలో మహిళలకు ముగ్గుల పోటీ, యువకులకు స్లో సైక్లింగ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

- విస్సన్నపేట: మండలంలో అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగ వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. దూరప్రాంతాల నుండి వచ్చిన బంధువుల రాకతో వివిధ రకాల పిండి వంటల తయారీతో,చిన్నారుల గాలిపటాలతో సందడిగా సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. మండలంలోని వేమిరెడ్డిపల్లి పంచాయతీ నర్మదానగర్ గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు, గ్రామ ఆడబిడ్డలకు, కోడళ్లకు తాడులాగుడు పోటీలు,యువకులకు క్రికెట్ పోటీలు, చిన్నారులతో నృత్యప్రదర్శన కార్యక్రమాలతో గ్రామం మొత్తం అనందంగా సంక్రాంతి పండుగ జరుపుకున్నారు. చిన్నారులు చేసిన నృత్యప్రదర్శనలు తిలకించేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.
- ఆగిరిపల్లి: మండలంలో సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. బంధువుల రాకలతో గ్రామాలు కళకళలాడాయి. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంప్రదాయబద్ధంగా కోడి పందేలు వేశారు. గాలిపటాలను పిల్లలు, పెద్దలు ఎగురవేశారు.



నర్మదానగర్‌లో తాడులాగుడు పోటీలో పాల్గొన్న మహిళలు



గంపలగూడెం మండలం కొత్తపల్లిలో ముగ్గుల పోటీ



ఇబ్రహీంపట్నం కొటికలపూడిలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



తిరువూరు రంగనాయకస్వామి ఆలయంలో గోపూజ



నెమలిలో గోపూజ

కట్టలేరు వంతెన నిర్మాణానికి నిధుల మంజూరు



వినగడప వద్ద కట్టలేరుపై వాహనాల రాకపోకలకు నిర్మించిన తాత్కాలిక రహదారి

తిరువూరు: గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వరదలకు కొట్టుకుపోయిన గంపలగూడెం మండలంలోని వినగడప కట్టలేరుపై వంతెన పునర్నిర్మాణానికి రూ.25.60 కోట్లు మంజూరు చేస్తూ రహదారులు, భవనాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వంతెన ధ్వంసం కాగా, తాత్కాలిక అప్రోచ్ రోడ్డు నిర్మించి వాహనాల రాకపోకలకు అనుమతిస్తున్నారు. నూజివీడు–గంపలగూడెం ఆర్ అండ్ బీ రహదారిపై హై లెవెల్ వంతెన నిర్మాణానికి గత మార్చి 19న తిరువూరు వచ్చినపుడు ఎమ్మెల్యే కె. రక్షణనిధి చేసిన విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేశారు.

ఘనంగా మంత్రి జోగి రమేష్ జన్మదిన వేడుకలు



మంత్రి జోగి రమేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ జన్మదిన వేడుకలు ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసం వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కోలాహలం మధ్య ఆయన సతీమణి జోగి శకుంతలదేవితో కలిసి కేక్ కట్ చేశారు. వివిధ మండలాల నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది కూడా రాష్ట్రంలో పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా వర్ధిల్లాలని మంత్రి జోగి రమేష్ ఆకాంక్షించారు. పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

168 మద్యం సీసాలు స్వాధీనం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): తెలంగాణ నుంచి అక్రమంగా తీసుకువస్తున్న 168 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణబాబు తెలిపారు. మండలంలోని బూదవాడ గ్రామానికి చెందిన గుగులోతు చెన్నయ్య ఆదివారం రాత్రి తెలంగాణ నుంచి గ్రామానికి మద్యం తీసుకువస్తుండగా వాహనాల తనిఖీలలో భాగంగా మద్యం సీసాలను గుర్తించామన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతులకు అండగా సహకార సంఘాలు

జయంతి(వీరులపాడు): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఆధ్వర్యంలో రైతులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నామని సొసైటీ చైర్మన్ జంగా కోటిరెడ్డి అన్నారు. మండలంలోని జయంతి గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాజ జగన్‌మోహనరావు కుటుంబసభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం సొసైటీ ద్వారా మంజూరైన రూ.10 వేలను మంగళవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో తాటికొండ రాఘవయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో టీడీపీ నేతల్లో వణుకు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నూజివీడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఎన్నికలంటే టీడీపీ నేతల్లో వణుకు పుడుతోందని మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, సచివాలయాల మండల కన్వీనర్ శీదర్ల శాంత కుమార్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే ప్రతాప్ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును చూసి టీడీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందన్నారు. టీడీపీ తరుపున ఎవరు పోటీ చేస్తారో తెలియని గందరగోళ పరిస్థితిలో టీడీపీ నాయకులు ఉన్నారని, దానిని కప్పిపుచ్చుకునేందుకు కల్లబొల్లి కబుర్లు, మాయ మాటలు చెబుతున్నారన్నారు. టీడీపీ నాయకులే కొందరు ప్రస్తుత టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జికి సీటు లేదని పందేలు సైతం కాశారని, దీనిని బట్టే టీడీపీ క్యాడర్ పరిస్థితి అర్థమవుతోందని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి కరపత్రాల ద్వారా ప్రచారం చేసుకోవచ్చని, ఓటీపీల ద్వారా అడగాల్సిన పని లేదన్నారు. టీడీపీ నిర్వహిస్తున్న ఓటీపీల కార్యక్రమాన్ని అడ్డం పెట్టుకొని ఇదే తరహాలో సైబర్ నేరగాళ్లు ఓటీపీలు చెప్పండంటూ ప్రజల బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను తస్కరించే ప్రమాదముందని, దానిని నిలువరించాలని కోరామన్నారు. దీనిపైనే ఎమ్మెల్యే ప్రతాప్ పలు సభల్లో ప్రజలను చైతన్యపరిచారని చెప్పారు. పార్టీ అధికారంలో లేనప్పుడే ప్రతిపక్షంలో పదేళ్లు ఉండి వైఎస్ జగన్ వెంట నడిచి అనేక పోరాటాలు చేశామని వివరించారు. సాధ్యం కాని హామీలను అమలు చేస్తానంటూ చంద్రబాబు మరోసారి మోసం చేసేందుకు ముందుకు వస్తున్నారని, అయితే చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు.

నిత్యాన్నదాన పథకానికి పలువురి విరాళం



ఆలయ చైర్మన్ జంగాలకు విరాళం అందజేస్తున్న పండగ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు



దాత పోలిశెట్టి సురేష్‌బాబును సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు

పెనుగంచిప్రోలు: గ్రామంలోని తిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం వత్సవాయి మండలం దబ్బాకుపల్లి గ్రామానికి చెందిన పండగ శ్రీనివాసరావు, ధనలక్ష్మి దంపతుల కుమారుడు అజయ్‌కుమార్, కుమార్తె నాగలక్ష్మి రూ.20,116 ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. విశాఖపట్నంకు చెందిన దోనెపూడి కృష్ణప్రసాద్ రూ.10,116, గోశాలలో గోవుల సంరక్షణకు పెనుగంచిప్రోలు మండలం సుబ్బాయిగూడెం గ్రామానికి చెందిన వడ్లమూడి శ్రీనివాసరావు రూ.10వేలు విరాళంగా అందజేశారు. మంగళవారం విజయవాడ రూరల్, భవానీపురానికి చెందిన పోలిశెట్టి సురేష్‌బాబు కుమారుడు సందీప్ ఫిబ్రవరి 23 అమ్మవారి కల్యాణం రోజున దీక్షాస్వాముల అన్నప్రసాద వితరణకు 20 క్వింటాళ్ల బియ్యం, క్వింటా కందిపప్పు, 5 నూనె డబ్బాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు జయంతి గ్రామ విద్యార్థి ఎంపిక

జయంతి(వీరులపాడు): పంజాబ్‌లోని చండీగఢ్ యూనివర్సిటీలో జరగనున్న నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు మండలంలోని జయంతి గ్రామానికి చెందిన శెట్టిపల్లి వేణుగోపాల్ ఎంపికవటం అభినందనీయమని ప్రవాసాంధ్రుడు పుట్లూరు మల్లారెడ్డి అన్నారు. గ్రామంలో పోటీలకు ఎంపికైన విద్యార్థికి తన కుమార్తె చైతన్యరెడ్డితో కలిసి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలలో ప్రతిభ కనబర్చి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా లూర్ధుమాత దేవాలయ రజతోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లోని విజయవాడ కథోలిక పీఠానికి చెందిన లూర్ధు మాత దేవాలయం రజతోత్సవం మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగాయి. న్యూ జోజినగర్ విచారణ గురువులు ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప ఆధ్వర్యంలో కుమ్మరిపాలెం సంఘస్తులు నిర్వహించిన ఈ వేడుకల్లో తొలుత స్థానిక వీధుల్లో లూర్ధు మాత విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం దేవాలయంలో జరిగిన దివ్యబలి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మోన్ సిగ్నూర్ మువ్వల ప్రసాద్, జోజినగర్ విచారణ సహాయక గురువులు ఫాదర్ రాజేష్, ఫాదర్ మరియదాసు, వన్‌టౌన్ విచారణ కర్తలు ఫాదర్ దామాల విజయ్‌కుమార్ తదితర గురువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ ఈ చర్చి స్థాపించిన నాటి నుంచి నేటి వరకు ఎంతో మంది గురువులు ఈ సంఘ అభివృద్ధికి, విచారణ అభివృద్ధికి, చర్చి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. లూర్ధు తల్లి ఎంతో సాధుశీలత గలవారని ఆమె మంచి మనస్సు గురించి వివరించారు. మన జీవితంలో కూడా సహృదయంతో తోటివారిపై ప్రేమాభిమానాలు కలిగి ఉండాలన్నారు. నలుగురికి సహాయపడే విధంగా క్రైస్తవ జీవితం ఉండాలని ఆకాంక్షించారు. ఎక్కడైతే దివ్యబలి పూజ సమర్పణ జరుగుతుందో అక్కడ సమావేశమైన అందరితోపాటు దేవదూతలు, పునీతలు మనకు కనిపించని రీతిలో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో సంఘస్తులు వనం బత్తిన ప్రవీణ్, జక్కి రమేష్, చలపతిరావు, పీతా కుమార్, కన్య స్త్రీలు, సంఘ పెద్దలు, జోజినగర్ విచారణ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా జ్యోతి దర్శనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లో కొలువై ఉన్న అయ్యప్పస్వామి వారి దేవస్థానంలో జ్యోతి దర్శనం సోమవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. అయ్యప్పస్వామి జయంతిని పురస్కరించుకొని ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకూ పలు విశేష కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మురళీధరన్ నంబూద్రి ఆధ్వర్యంలో ఉదయం నెయ్యాభిషేకం, పాలాభిషేకం, ఇతర పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. అనంతరం విశేష అలంకారాన్ని నిర్వహించారు. సహస్ర నామార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారికి విశేష హారతి కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక అలంకరణ చేసి స్వామి వారికి విశేష అర్చనను నిర్వహించారు. అనంతరం ఆలయంపైన జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామి వారి జ్యోతిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తదితరులు స్వామి వారిని దర్శించుకొని జ్యోతి వేడుకల్లో పాల్గొన్నారు. పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకొని పూజించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని ఈ నెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న దృష్ట్యా దళిత సామాజికవర్గం పెద్ద ఎత్తున తరలి రావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా విజయవాడ నడిబొడ్డున నిర్మించిన అంబేడ్కర్ స్మృతివనం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అంబేడ్కర్ స్మృతివనం ప్రపంచం గర్వపడే విధంగా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటం సీఎం జగనన్న ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలి వచ్చి అంబేడ్కర్‌కు నివాళులర్పించాలని కోరారు. అంబేడ్కర్ ఆలోచనా విధానంతో పరిపాలన సాగిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అనేక విధాలుగా మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అంబేడ్కర్ విగ్రహ కమిటీ చైర్మన్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జునలకు ఐదు కోట్ల ఆంధ్రుల తరఫున అభినందనలు తెలిపారు.